క్లుప్తంగా

ఉచిత వైద్య పరీక్షలు

గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరానగర్ కాలనీ పరిసర ప్రాంతాలలో పేదలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, ఇతర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు మెరుగుమాల శివరామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కోనా రామారావు, కోశాధికారి కె. రామకృష్ణ, జోనల్ చైర్‌పర్సన్ పి. సత్యన్నారాయణ, లింగం చిట్టిబాబు, పొన్నూరు రామకృష్ణ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నసమారాధన



గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బేతవోలులోని శాంతి వృద్ధుల వృద్ధాశ్రమంలో అన్నసమారాధన నిర్వహించారు. సంఘం సేవా కార్యక్రమాలలో భాగంగా అన్న సమారాధన నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ తెలిపారు. ముదినేపల్లి మండలం పేరూరుమాజీ సర్పంచ్ సోమా సత్యనారాయణ సౌజన్యంతో ఈ భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్, ఆర్కే ఫౌండేషన్ అధ్యక్షుడు కె.రామకృష్ణ, ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గారపు తిరుపతయ్య, యాదవ సేవా సంఘం మహిళా కార్యదర్శి కె. నాగమణి, కె. హరిబాబు, జాజుల తాతారావు, ఎం. సత్యం పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



గుడివాడ టౌన్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని వినియోగదారుల ఫోరం జిల్లా జడ్జి ఎస్. పద్మారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఏలూరు రోడ్‌లోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో విద్యాలయ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన పద్మారెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సేవలను వివరించారు. ప్రపంచ దేశాలకు ఆరోగ్య రక్షణ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు ఆర్గనైజేషన్ సూచనలిస్తుందన్నారు. ప్రజలను, ప్రభుత్వాలను అప్రమత్తం చేస్తుందన్నారు. విద్యార్థుల్లో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ఉండాలన్నారు. అప్పుడే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలుగుతారన్నారు. కార్యక్రమంలో విద్యాలయ హైస్కూల్ డైరెక్టర్ బొప్పన వెంకట విజయభాస్కర్, ఉమా హోమియో స్టోర్స్ అధినేత ఉమారెడ్డి పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధన

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణ మహోత్సవాలు ముగిసిన సందర్భంగా ఆదివారం సాయంత్రం నుంచి భారీ అన్నసమారాధన జరిగింది. ఉదయం పూర్ణాహుతి, త్రిశూల స్నానం, గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు పవళింపుసేవ వైభవంగా నిర్వహించారు. అన్నసమారధనలో మండవల్లి, గన్నవరం, కొర్లపాడు, అయ్యవారిరుద్రవరం తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ, ఈఓ దివ్యశ్రీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

కైకలూరు: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పట్టణ సీఐ ఆకుల రఘు అన్నారు. కేంద్ర సాయుధ దళాలతో ప్రజల్లో చైతన్యం కలిగించడానికి వేమవరప్పాడు, తామరకొల్లు, వింజరం గ్రామాల్లో ఆదివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు పోలీస్‌శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్లే సమయంలో సరైన ధ్రువపత్రాలు పోలీసు సిబ్బందికి చూపించాలన్నారు.

భక్తి శ్రద్ధలతో షబ్ ఏ ఖదర్

గూడూరు: అత్యంత పవిత్రమైన రంజాన్ మాసంలో వచ్చే షబ్ ఏ ఖదర్ వేడుకలు శనివారం రాత్రి గూడూరు మండలంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. లైలతుల్ ఖదర్ వేడుకలను పురస్కరించుకుని మండలంలోని గూడూరు, ఆకులమన్నాడు, పినగూడూరులంక, మల్లవోలు, తరకటూరు, పోలవరం, షా అబ్దుల్లా పాలెం గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గూడూరులోని జామియా మసీదులో హాఫిజ్ షోయబ్ మొహమ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనలలో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మసీదులను ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేశారు. రంజాన్ మాసం ప్రారంభం నుంచి మసీదుల్లో నిర్వహిస్తున్న తరావీ నమాజులలో ఖురాన్ పఠనం పూర్తయిన సందర్భంగా మత గురువులను ఘనంగా సత్కరించారు. అనంతం భక్తులకు తబర్రుక్ పంపిణీ చేశారు.

ముమ్మరంగా ఎమ్మెల్యే కొడాలి నాని ప్రచారం



ఓటర్లకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో లబ్ధి చేకూరిన వారంతా స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీకి మద్దతు పలుకుతున్నారని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. ఆదివారం స్థానిక 1, 25 వార్డులలో ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. స్థానిక నాయకులు కొడాలి నానికి ఘన స్వాగతం పలికారు. తీన్మార్ డప్పులతో, జైజై నినాదాలతో ఎన్నికల ప్రచారం ప్రారంభమైంది. తొలుత ఏలూరు రోడ్ చంద్రయ్య కాలువ గట్టుపై నివాసులను ఇంటింటికీ వెళ్లి పలకరించారు. అనంతరం టీచర్స్ కాలనీలో ఎన్నికల ప్రచారం కొనసాగించారు. ప్రచారంలో భాగంగా స్థానిక హోసన్నా ప్రార్థనా మందిరంలో క్రైస్తవులతో కలిసి ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్ కృపాదానం కొడాలి నానికి దీవెనలు తెలిపారు. బైపాస్‌రోడ్, పాత ఎస్‌బీఐ రోడ్, లోయ వారి వీధిలో ప్రచారం ముమ్మరంగా జరిపారు. మహిళలు పెద్ద ఎత్తున హారతులు ఇస్తూ పూలు జల్లుతూ స్వాగతం పలికారు. ప్రచారంలో చిన్నారులను ఎత్తుకుని ముద్దాడుతూ వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షాన ఒంటరిగా పోరాడుతున్నారన్నారు. ఐదేళ్ల పాలనలో పేదలకు చేసిన అనేక సంక్షేమ పథకాలు, ఆయన పరిష్కరించిన పేదల సమస్యలు వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపిస్తాయని జగన్‌మోహన్‌రెడ్డి అంటున్నారన్నారు. మోసగాళ్లంతా కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని మళ్లీ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని దోచుకునేందుకు ఎన్నో ఎత్తులు వేస్తున్నారన్నారు. తన ప్రచారంలో అయితే మంచి చేసిన జగన్‌మోహన్‌రెడ్డికి తాము మద్దతు అంటూ ప్రజలు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం 25వ వార్డు పెద ఎరికపాడులో ప్రచారం కొనసాగించారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, అన్ని అనుబంధ సంస్థల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.



చిన్నారిని ముద్దాడుతున్న ఎమ్మెల్యే కొడాలి నాని

కాలి నడకన భద్రాచలం బయలు దేరిన భక్తులు



భద్రాచలం బయలుదేరిన భక్తులకు స్వాగతం పలుకుతున్న కళాపరిషత్ సభ్యులు

జుజ్జువరం(పామర్రు): మండలంలోని జుజ్జువరం గ్రామానికి చెందిన 60 మంది భక్తులు కాలి నడకన గ్రామం నుంచి భద్రాచలానికి ఆదివారం బయలుదేరారు. ఈ నెల 17వ తేదీన భద్రాచలంలో జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవంలో పాల్గొనేందుకు జుజ్జువరం నుంచి కాలినడకన బయలుదేరారు. మార్గ మధ్యంలో పెదమద్దాలి శివారు కొత్త పెదమద్దాలిలోని శ్రీ అభయాంజనేస్వామి ఆలయం వద్ద పాదయాత్ర భక్తులు కొలది సేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు పామర్రు కళా పరిషత్ అధ్యక్షుడు ఎన్ త్రివిక్రమరావు వితరణలో అల్పాహారం, ప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పామర్రు ప్రకండ అధ్యక్షుడు అరిగెల బాలుడు, మండల అధ్యక్షుడు నందిపు పాండురంగారావు, కళా పరిషత్ గౌరవాధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్, సమరసత కన్వీనర్ లక్ష్మణరావు, ప్రతినిధులు వెంకనారాయణ, వెంకటరత్నం, సుబ్బారావు, సుబ్రమణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహ పునఃప్రతిష్ట

మండవల్లి: మండవల్లి సెంటర్‌లో బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహ పునః ప్రతిష్ట సోమవారం నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శాంతరాజు, గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, సీహెచ్ విజయ్, మెండా సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షత వహించనున్నట్లు తెలిపారు.

శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబు



కలిదిండి: తాడినాడ గ్రామంలోని శ్రీ సీతారామ స్వామి దేవస్థానం శ్రీ రామనవమి వేడుకలకు ముస్తాబవుతుంది. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు కల్యాణ మహోత్సవ ఏర్పాట్లను ఆదివారం పర్యవేక్షించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా (ఈ నెల 17వ తేదీన) సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, ఎండతీవ్రతతో పాటు తీవ్ర వడగాల్పులు ఎక్కువ అవుతున్న వేళ పందిర్లు అధికంగా వేస్తున్నట్లు తెలిపారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఉదయానికే ఆలయానికి చేరుకోవడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారి పుట్టలో పాలు పోసేందుకు, పాల పొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసేందుకు అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. స్వామిని దర్శించుకున్న అనంతరం నాగబంధాల వద్ద పూజలు చేశారు. అదేవిధంగా గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ శొంఠినాగరాజు, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షణ చేశారు.

ఇద్దరు జూదరుల అరెస్టు

కైకలూరు: పేకాడుతున్న ఇద్దరిని కైకలూరు టౌన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఆటపాకలో పేకాట ఆడుతున్నారనే సమాచారం అందడంతో దాడి చేసి ఇద్దరి నుంచి రూ.1,110 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు.

కనులపండువగా మల్లేశ్వరస్వామి కల్యాణం



శ్రీ మల్లేశ్వరస్వామి కల్యాణం జరుగుతున్న దృశ్యం

మండవల్లి: మండవల్లిలో కొలువైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో గూడూరు రామకృష్ణ యాజ్ఞికత్వంలో శ్రీ భ్రమరాంబదేవి, మల్లేశ్వరస్వామి కల్యాణం శనివారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుల వేదమంత్రోచ్ఛరణతో ఆలయప్రాంగణం మార్మోగింది. ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ, కార్యనిర్వహణాధికారి దివ్యశ్రీ కల్యాణ మహోత్సవాన్ని పర్యవేక్షించారు. అర్చకులుగా గూడూరు శ్రీనివాసరావు, నాగవెంకటశాస్త్రి, తేజనాగసాయికుమార్ వ్యవహరించారు. స్వస్తి వాచకులుగా ద్వాదశి కామేశ్వరశర్మ, ఫణికుమార్ శర్మ, హరి వెంకటసుబ్రహ్మణ్యం వ్యవహరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, మెంబా సురేష్ పాల్గొన్నారు.

మాటకు కట్టుబడే ఏకైక సీఎం జగన్



ప్రజా ఆశీర్వాదయాత్రలో అభివాదం తెలుపుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి ఒక్క హామీ అమలు చేశారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 36వ రోజు వెంకటాపురం, గోపాలపురం గ్రామాల్లో పర్యటించి ప్రజా ఆశీర్వాద యాత్రను ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే ముందుగా అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే డీఎన్నార్‌కు స్వాగతం పలుకుతూ హారతులు పట్టారు. మేనిఫెస్టో 99 శాతం అమలు చేశారని, గత ప్రభుత్వాల్లో ఇలా ఎప్పుడైనా జరిగిందా ఆలోచించాలని కోరారు. పల్లెల్లో ఉన్న ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలంటే జగన్‌తోనే సాధ్యమవుతుందని, మీ ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీ కూసంపూడి కనక దుర్గారాణి, సర్పంచ్‌లు అనపర్తి వడ్డి కాసులు, గద్దె ఆనంద్‌కుమార్, సాన మీనా సరస్వతి, మసీముక్కు మారుతి ప్రసన్న, ద్రోణాద్రి నాగలక్ష్మీ, గండికోట ఏసుబాబు, చెరుకువాడ బలరామరాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అమ్మవారి గ్రామోత్సవం



చిన్నఅమ్మవారి ఊరేగింపు

కోడూరు: స్థానికంగా గంగాభవానీ అమ్మవారి గ్రామోత్సవం భక్తిప్రపత్తులతో కొనసాగుతోంది. ఆదివారం కోడూరు తూర్పువైపు, స్వతంత్రపురం, ఎస్సీవాడల్లో చిన్నఅమ్మవారిని ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. ప్రతి ఇంటి వద్ద అమ్మవారి వాహనం ముందు నీటిని వారబోసి భక్తులు స్వాగతం పలుకుతున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీరలను సమర్పించి తమ భక్తిభావం చాటుతున్నారు. వీవర్స్‌కాలనీ, నరసింహపురం, కృష్ణాపురం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, యర్రారెడ్డి వారిపాలెం గ్రామాల్లో కూడా అమ్మవారి గ్రామోత్సవం కొనసాగుతుందని ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు తెలిపారు. 10వ తేదీన ప్రధాన గుడిసంబరం నిర్వహించిన అనంతరం 11వ తేదీన చిన్నఅమ్మవారిని ఆలయ ప్రవేశం చేయించనున్నట్లు యుగంధరరావు చెప్పారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న మానవత సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఇతోధికంగా సాయం అందిస్తుందని ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. తిమ్మనవీడుకు చెందిన వీసం మహేష్ వీఐటీ అమరావతి క్యాంపస్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆర్థిక స్థోమత లేకపోవటంతో ఫీజు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతూ మానవత సంస్థను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో వీసం మహేష్‌కు రూ.17 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం పంపిణీ చేశారు. భవిష్యత్‌లోనూ తనవంతు సాయాన్ని అందిస్తామని మానవత సభ్యులు భరోసా ఇచ్చారు. మానవత హనుమాన్ జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, సీనియర్ సభ్యులు బాణాల నరసింహారావు, నారగాని కొండలరావు, వడ్డి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

భార్య, కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

కైకలూరు: భార్య, కుమార్తె కనిపించడం లేదంటూ స్థానిక అంజోనా క్లినిక్ డాక్టరు గంగోళి అభిజిత్‌కుమార్ కైకలూరు టౌన్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. కైకలూరు ఘుమఘుమలు రెస్టారెంటు సమీపంలో 15 ఏళ్లుగా ఆర్‌ఎంపీగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన అభిజిత్ పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య దీప్తీ, యూకేజీ చదువుతున్న కూతురు సిద్ది ఉన్నారు. శనివారం భార్యాభర్తల మధ్య వివాదం చోటుచేసుకుంది. విధులు ముగించుకుని వెళ్లిన అతనికి ఇంట్లో భార్య, కుమార్తె కనిపించలేదు. చివరకు టౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

కంకిపాడు: పట్టణంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన కొనసాగుతోంది. పలు దుకాణాల వద్ద రాజకీయ పార్టీలకు చెందిన జెండాలను విక్రయిస్తున్నారు. ఇబ్బడిముబ్బడిగా కూటమికి చెందిన జెండాలను బహిరంగ ప్రదేశాల్లో ఉంచి అమ్ముతున్నారు. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో ప్రత్యేక అనుమతులు ఉండాలి. కానీ అవేవీ పట్టనట్లు కొందరు దుకాణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఎన్నికల నియమావళి పర్యవేక్షణాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైఎస్సార్ సీపీని మళ్లీ ఆశీర్వదించండి

ఎమ్మెల్యే అనిల్‌కుమార్



ఆర్‌హెచ్ నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మళ్లీ ఆశీర్వదించి విజయం అందించాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. పామర్రు టౌన్‌లోని ఆర్‌హెచ్ నగర్, యాదవాపురం తదితర ప్రాంతాల్లో మన ఇంటికి మన కైలే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. స్థానిక మహిళలు మంగళహారతులను పట్టి స్వాగతం పలికారు. ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం దిశగా తగు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న కాలంలో వైఎస్సార్ సీపీని గెలిపించుకునేందుకు ప్రజలు అందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. పేదలకు సంక్షేమ పథకాలను అందించి వారిని ఆర్థిక స్థితి మంతులుగా చేయాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తగు చర్యలు తీసుకున్నారన్నారు. పింఛన్ల పంపిణీ నుంచి వలంటీర్లను తప్పించడంతో లబ్ధిదారులు పడుతున్న అవస్థలను చూసి టీడీపీ నేత చంద్రబాబు రాక్షసానందం పొందుతున్నారన్నారు. దీనికి రానున్న కాలంలో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. గడిచిన 56 నెలలుగా జగన్ ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే తీసుకెళ్లి వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేస్తే దానిని అడ్డుకుని, ఇప్పుడు ఆ తప్పును కప్పిపుచ్చుకునేందుకు బాబు అండ్ కో నానా పాట్లు పడుతున్నారని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్‌ను, పామర్రు ఎమ్మెల్యేగా తనకు ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. స్థానిక వార్డు మెంబరు ఆరేపల్లి శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు బోగిన వెంకటేశ్వరమ్మ, తాడిశెట్టి శ్రీనివాసరావు, ఆర్బీకే మండల అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఉప సర్పంచ్ బాల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, పెయ్యల రాజు, మద్దుల సుబ్రమణ్యం, తిరుమలశెట్టి వాసు, కాకి ప్రవీణ్, బి మధురెడ్డి, చిన్నం శ్రీనివాసరావు, ఆరుమళ్ల శివారెడ్డి, కూసం పెదవెంకటరెడ్డి, మోరా వెంకటరెడ్డి యార్లగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

ప్రత్యేక ప్రార్థనలు

పామర్రు: క్రైస్తవుల సంక్షేమం కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేసినట్లు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక నాగులేరు కాలువ గట్టు వద్ద ఉన్న చర్చిలో ఎమ్మెల్యే ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రభువుని ప్రార్థించామన్నారు. రానున్న ఎన్నికలలో జగన్‌మోహన్ రెడ్డి విజయం సాధించి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం చర్చి పాస్టర్ రవి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆరేపల్లి శ్రీహరి పాల్గొన్నారు.

స్థానికులకే పట్టం కట్టాలి



సింగరాయపాలెంలో ప్రచారం చేస్తున్న దూలం స్వాతి

ముదినేపల్లి రూరల్: నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే స్థానిక నాయకులకే రేపటి ఎన్నికల్లో పట్టం కట్టాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలోని సింగరాయపాలెంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైఎస్సార్ సీపీ తరఫున ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజల సమస్యలను ఏనాడూ పట్టించుకోని ప్రతిపక్ష నాయకులు నేడు ఎన్నికలు వచ్చేసరికి ప్రజా సేవ చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. ఇలాంటి వారి మాటలను నమ్మి ఓటు వేస్తే నియోజకవర్గం అధోగతిపాలు కాక తప్పదని హెచ్చరించారు. పిలిస్తే పలికే, అందుబాటులో ఉండే దూలం నాగేశ్వరరావు, కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే, ఎంపీగా గెలిపించాలన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధ, సర్పంచ్ బోయిన విమల, నాయకులు మోట్రు ఏసుబాబు, కోమటి విష్ణు వర్ధన్, బోయిన రామరాజు, పేర్ని పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు ఏర్పాటు



ముస్లింలకు వడ్డిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: రంజాన్‌ను ప్రతిఒక్కరూ భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని పామర్రెద్దెమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక మసీదులో ఆదివారం రాత్రి ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందు లో పాల్గొన్నారు. తొలుత పార్టీ నాయకులతో కలిసి మసీదులో జరిగిన ఉపవాస దీక్షల విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలను తెలిపారు. ముస్లింలు ఐక్యంగా ఉండి రానున్న కాలంలో వైఎస్సార్ సీపీ అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు నయిముద్దీన్, ఎండీ హస్మతుల్లా, కాలిక్, హుస్సేన్, ఆసీఫ్, ఎండీ జమీల్, ఫిరోజ్, మసీదు కమిటీ అధ్యక్షులు ఆరీఫ్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనివాసరావు, బాలవెంకటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, మాధవరెడ్డి, పెద వెంకటరెడ్డి, సజ్జా సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆది వినయ్

కలిదిండి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు ఆకర్షితులై వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తనయుడు దూలం వీర ఆది వినయ్ అన్నారు. పెదలంక గ్రామంలో 20 మంది టీడీపీ కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఆది వినయ్, నాయకులు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. తిరుమాని వెంకటేష్, కొల్లాటి బ్రహ్మానాయుడు, కొల్లాటి సత్యనారాయణ, కొల్లాటి మోహనరావు, కొల్లాటి వెంకటేష్, కొల్లాటి చిన స్వామి, కొక్కలిగడ్డ పోతురాజు, పోతబత్తుల నరసింహ స్వామి, నాగిడి శివాజీ తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, సర్పంచ్ మోకా లక్ష్మీ రామకష్ణ పాల్గొన్నారు.

నేడు రాజేశ్వరస్వామి ఆలయంలో బహిరంగ వేలం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని రాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు పాత ఇనుముకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి తెలిపారు. సీజీఎఫ్ పనుల్లో భాగంగా ఆలయం ముఖ మండపం కొట్టివేయగా వచ్చిన 500 కిలోల పాత ఇనుముకు దేవదాయశాఖాధికారుల సమక్షంలో ఈ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని కోరారు.